క్లుప్తంగా

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి

పాలకొండ రూరల్: విద్యార్థులంతా శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కొండపల్లి గౌరునాయుడు అన్నారు. స్థానిక వివేకానంద స్కూల్‌లో జన విజ్ఞాన వేదిక నేతృత్వంలో రాష్ట్ర స్థాయి కళాజాతా కార్యక్రమం మంగళవారం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విజ్ఞానశాస్త్ర అంశాలపై అవగాహన కల్పించారు. మూఢనమ్మకాలు వీడాలని, ప్రతి విషయాన్ని విజ్ఞానశాస్త్రాన్ని అన్వయిస్తూ పరిశీలిస్తే అసలు విషయం అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి జి.గిరిధర్, సభ్యులు బి.వి.రమణ, ఎస్.మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రంగంవలసలో ఏనుగుల సంచారం

సీతంపేట: ఏజెన్సీలోని ఎత్తైన కొండలపై ఉన్న రంగంవలస గ్రామ పరిసరాల్లో ఏనుగులు సంచరిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. కొండపోడు వ్యవసాయ పనుల నిమిత్తం మంగళవారం అటువైపుగా వెళ్తున్న కొంతమందికి గజరాజుల గుంపు కనిపించడంతో వారు భయంతో వెనుదిరిగారు. అరటి పంటతో పాటు అక్కడి పలు పంటలకు నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎఫ్‌బీవో దాలినాయుడు ప్రజలెవరూ అటువైపుగా వెళ్లకుండా అటవీ శాఖ సిబ్బందితో అప్రమత్తం చేస్తున్నారు.

గ్రామాల్లో ఎప్పటికప్పుడు ఆరోగ్యసర్వేలు నిర్వహించాలి


గలావల్లి పీహెచ్‌సీలో మందులను పరిశీలిస్తున్న జగన్మోహనరావు

బలిజిపేట: గ్రామాల్లో ఎప్పటికప్పుడు ఆరోగ్య సర్వేలు నిర్వహించి జ్వర లక్షణాలు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారిని గుర్తించి అవసరమైన సేవలు అందించాలని జిల్లా మలేరియా అధికారి జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు బలిజిపేట మండలంలో గలావల్లి, బలిజిపేట పీహెచ్‌సీలను ఆయన మంగళవారం పర్యవేక్షించారు. జ్వర లక్షణాలు, ఆరోగ్య సమస్యలు ఉన్నవారిని గుర్తిస్తే వెంటనే ప్రాథమిక చికిత్స అందచేసి మలేరియా, డెంగీ వంటి జ్వరాలు నిర్ధారణ అయితే వెంటనే సమాచారాన్ని తెలియజేయాలని సూచించారు. గర్భిణుల రిజిస్ట్రేషన్ త్వరగా జరగాలని కోరారు. హైరిస్క్ గర్భిణుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని చెప్పారు. కేంద్రాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు వైద్యసేవలు అందించాలని సూచించారు. పిల్లలకు శతశాతం టీకాలు వేయాలని స్పష్టం చేశారు. డీ వార్మింగ్ డే కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని, ఏడాది వయస్సు నుంచి 19సంవత్సరాల వరకు పిల్లలందరికి ఆల్బెండల్ మాత్రలను నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం అందించాలని చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్‌సీల వైద్యాధికారులు శ్రీనివాస్, కిరణ్మయి, సూపర్‌వైజర్లు, సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

డీవార్మింగ్ డేకు అంతా సిద్ధంగా ఉంచాలి

బలిజిపేట: ఈనెల 9వ తేదీన నిర్వహించనున్న డీ-వార్మింగ్ డే కార్యక్రమానికి ఏర్పాట్లు పక్కాగా నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ జగన్నాథం సూచించారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని అరసాడ పీహెచ్‌సీని ఆయన మంగళవారం ఆకస్మికంగా పర్యవేక్షించారు. డీ-వార్మింగ్ డే కార్యక్రమానికి ఎంతమంది పిల్లలు లక్ష్యంగా పెట్టుకున్నారని వైద్యాధికారులను ప్రశ్నించారు. అందుకు తగిన ఏర్పాట్లు పూర్తిచేసింది లేనిదీ అడిగి తెలుసుకున్నారు. ఆల్బెండజోల్ మాత్రలను పిల్లలతో మింగించాలని సూచించారు. దీనివల్ల నులిపురుగుల నివారణ జరుగుతుందన్నారు. పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలించారు. ఆన్‌లైన్‌లో పొందుపరిచిన అంశాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మందులు, ల్యాబ్ పరీక్షల వివరాలను పరిశీలించారు. అందులో భాగంగా ఆశ డే సమావేశంలో మాట్లాడుతూ ఆశ వర్కర్లు గ్రామాల్లో ఎటువంటి ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు.

రహదారి భద్రతా నియమాలను విధిగా పాటించాలి

పార్వతీపురంటౌన్: రహదారి భద్రతా నియమాలను విధిగా పాటించాలని ఏఎంవీఐలు జి.సత్యనారాయణ, ఆర్.రమేష్ కుమార్‌లు కోరారు. ఈ మేరకు మంగళవారం పార్వతీపురం ఆర్టీసీ డిపో ఆవరణలో రహదారి భద్రత వారోత్సవ అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని రహదారి భద్రత నియమాలను పాటించాలని సూచించారు. ప్రజలంతా ద్విచక్రవాహనం నడిపేటప్పుడు ఐఎస్ఐ మార్కు కలిగిన హెల్మెట్లనే వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. ఓవర్ స్పీడ్, పరిమితికి మించి అధిక ప్రయాణికులతో వాహనాన్ని నడపరాదని హితవు పలికారు. స్కూల్ పిల్లలను తీసుకువెళ్లే బస్సులు, ఆటో డ్రైవర్లు ఎక్కువమంది విద్యార్థులను వాహనాల్లో ఎక్కించరాదన్నారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయాలి


కోమటిపేట సచివాలయంలో చేస్తున్న రిజిస్ట్రేషన్లను పరిశీలిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: జగనన్న కాలనీల్లోని ఇళ్లకు సంబంధించి, రిజిస్ట్రేషన్‌లు వేగవంతం చేయాలని నగరపంచాయతీ కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు సూచించారు. స్థానిక పట్టణంలోని సచివాలయాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన మంగళవారం పరిశీలించారు. రిజిస్ట్రేషన్ చేసుకుంటే లబ్ధిదారుకు ఇంటిపై సర్వహక్కులు లభిస్తాయని, రిజిస్ట్రేషన్ కోసం ఇంటి పట్టా, ఆధార్ జిరాక్స్ పట్టుకుని, సచివాలయానికి రావాలన్నారు. మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఎంపీడీవో పైడితల్లి పరిశీలించారు.

అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలి


ప్రధానోపాధ్యాయులకు సూచనలిస్తున్న డిప్యూటీ డీఈవో కృష్ణమూర్తి

• డిప్యూటీ డీఈవో పి.కృష్ణమూర్తి

పాలకొండ రూరల్: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు మెరుగుపరచాలని డిప్యూటీ డీఈవో పి.కృష్ణమూర్తి సూచించారు. స్థానిక పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలతో పాటు మండలంలోని ఎం.సింగుపురం, భాసూరు, తంపటాపల్లి గ్రామాల పాఠశాలలను ఎల్‌ఐపీ(ఇంప్రూవ్‌మెంట్ లెర్నింగ్ ప్రోగ్రాం) బృంద సభ్యులతో కలిసి మంగళవారం సందర్శించిన ఆయన అక్కడి ఉపాధ్యాయుల బోధనాతీరు, విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలించారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యా ప్రగతికి కృషి చేయాలన్నారు. అలాగే విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.జనార్దనరావు, అంపిలి కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలి


డాక్టర్ పావనికి వినతిపత్రం ఇస్తున్న ఆశవర్కర్స్ యూనియన్ నాయకుడు జీవీ రమణ

సీతానగరం: మండలంలోని పీహెచ్‌సీల ద్వారా గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న ఆశవర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పీహెచ్‌సీ డాక్టర్ పావనికి సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు మంగళవారం విరామసమయంలో వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు ఆశవర్కర్ల యూనియన్ జిల్లా నాయకుడు జీవీ రమణ మాట్లాడుతూ గ్రామాల్లో ఏఎన్‌ఎంలకు అందుబాటులో ఉంటూ మహిళలకు వైద్యసేవలు అందిస్తున్న ఆశవర్కర్లకు ఇస్తున్న గౌరవవేతనం పెంచాలని, ఆశలను సీహెచ్‌డబ్ల్యూగా పరిగణనలోకి తీసుకోవాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, విద్యార్హత కలిగిన వారిని ఏఎన్‌ఎంలుగా పరిగణనలోకి తీసుకుని శిక్షణ ఇవ్వాలని కోరారు. నిర్దేశించిన సమయానికి సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేయనున్నట్లు స్పష్టం చేస్తూ వినతిపత్రం అందజేశారు. దీనిపై పీహెచ్‌సీ డాక్టర్ పావని మాట్లాడుతూ ఆశ కార్యకర్తలు ఇచ్చిన వినతిపత్రాన్ని జిల్లా ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు చెప్పారు.

అభ్యసన స్థాయిని పెంచాలి

సీతానగరం: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి అనుగుణంగా విద్యార్థుల్లో అభ్యసన స్థాయిని ఉపాధ్యాయులు పెంచాలని ఎంఈఓ జి.సూరిదేముడు కోరారు. ఈ మేరకు భాషాభివృద్ధి కార్యక్రమం అమలులో భాగంగా మండల స్థాయిలో నిర్దేశించిన ఉపాధ్యాయుల బృందం నిడగల్లు ఉన్నత పాఠశాలను మంగళవారం పరిశీలించింది. ఈ సందర్భంగా ఎంఈఓ సూరిదేముడు మాట్లాడుతూ విద్యాబోధనలో జరుగుతున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిబంధనలను అనుసరించి విద్యాబోధన చేయాలని కోరారు. అనంతరం మండలస్థాయి పర్యవేక్షణ ఉపాధ్యాయుల బృందం నిడగల్లు ఉన్నత పాఠశాలలో ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల వారీగా విద్యార్థుల అభ్యసనస్థాయి, సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయుల విద్యాబోధన నిర్వహించిన రికార్డులను పరిశీలించారు. హెచ్‌ఎం ఎం.శివున్నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం పాఠశాలకు హాజరై ఉపాధ్యాయులు నిర్వహిస్తున్న బోధనను ఇనుమడించుకోవాలని, విద్యనభ్యసించడంతో విద్యార్థుల్లో విద్యావిప్లవం రావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో టీమ్‌లీడర్ ఇల్లా ప్రసన్నలక్ష్మి, ఎ.జగన్నాథరావు, ఎస్.రవీంద్ర, పి.శైలజ, వేణుగోపాల్, బి.తిరుపతిరావు పాల్గొన్నారు.

సృజనాత్మకత వెలికితీతకు విజ్ఞానప్రదర్శనలు దోహదం


ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పాలకొండ రూరల్: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు విజ్ఞాన ప్రదర్శనలు దోహదం చేస్తాయని తమ్మినాయుడు విద్యాసంస్థల అధ్యక్షురాలు ఎస్.నారాయణమ్మ అన్నారు. మంగళవారం స్థానిక తమ్మినాయుడు విద్యాసంస్థల్లో విద్యార్థులు రూపొందించిన పలు సైన్స్ ప్రాజెక్ట్‌లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆమెకు ప్రాజెక్టుల పనితీరు, ప్రయోజనం, ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం:

స్థానిక వైటీసీలో ఏపీఎస్ఎస్‌డీసీ, పార్వతీపురం ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించే ఉపాధి శిక్షణను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని వైటీసీ మేనేజర్ ఎ.ఎ.రాము మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రిటైల్ స్టోర్ మేనేజర్ కోర్సుకు 2 నెలలు, డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు 2 నెలలు, నర్సింగ్ (జీడీఏ) కోర్సుకు 2 నెలలు చొప్పున శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణకు సంబంధించిన మెటీరియల్‌తో పాటు శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు గుమ్మలక్ష్మీపురం వైటీసీలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8978878557లో సంప్రదించాలని కోరారు.

పంచాయతీ డీడీఓ పోర్టల్‌లో లాగిన్ అవ్వాలి


ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు

సీతానగరం: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు సచివాలయ డీడీఓల పోర్టల్‌లో లాగిన్ అయి వివరాలు అప్‌లోడ్ చేయాలని ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్,జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాలమేరకు పంచాయతీ కార్యదర్శులు తమ లాగిన్‌లో ఉన్న సిబ్బంది వివరాలను డీడీఓ సచివాలయం ఎన్నికల పోర్టల్‌లో తక్షణమే నమోదు చేయాలని ఆదేశించారు. గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికను ఈ గ్రామస్వరాజ్ పోర్టల్‌లో త్వరితగతిన నమోదు చేయాలని కోరుతున్నామన్నారు. తదుపరి ఇళ్ల పన్నుల వసూలు వివరాలు ఆన్‌లైన్ ద్వారా సేకరించి మండలంలో నూరుశాతం పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గర్భిణులకు రక్తహీనతపై అవగాహన కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఐఓ నారాయణరావు

• డీఐఓ నారాయణరావు

పార్వతీపురంటౌన్: గర్భిణులకు రక్తహీనతపై అవగాహన కల్పించాలని డీఐఓ డాక్టర్ నారాయణరావు అన్నారు. ఆశ డే సందర్భంగా మంగళవారం పార్వతీపురం జిల్లా ఆస్పత్రి ప్రాంగణంలో ఆశ వర్కర్లతో ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులకు రక్తహీనత, ఫ్యామిలీ డాక్టర్ విధానం, ఇతర ఆరోగ్య సమస్యలు, ఈ ఆశ యాప్‌పై అవగాహన కల్పించాలని చెప్పారు. బాలింతలు, ప్రసవ సమయం దగ్గర పడుతున్న గర్భిణుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రతి నెల 9వ తేదీన జరిగే పీఎంఎస్ఎంఏ కార్యక్రమాలకు గర్భిణులు హాజరయ్యేలా చూడాలన్నారు. సాధారణ ప్రసవాలన్నీ పీహెచ్‌సీల్లోనే జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హెచ్ఐవీ, సిఫిలిస్, టీబీ, సుగర్ నిర్ధారణ పరీక్షలు కచ్చితంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. హైరిస్క్, రక్తహీనత కలిగిన గర్భిణులు ఎనీమియా బారిన పడకుండా చూడాలన్నారు. పీఎంఎంవీవై, జేఎస్‌వై ఆరోగ్య ఆసరా సంక్షేమ పథకాలు ఉన్నాయని, గర్భిణుల ఆరోగ్య శ్రేయస్సు కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని ఆరోగ్య సేవలు పూర్తిస్థాయిలో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో పీపీయూనిట్ వైద్యులు డాక్టర్ మనోజ్, డాక్టర్ లావణ్య, హెల్త్ సూపర్‌వైజర్లు జయగౌడ్, పుష్ప, ఇందిర, వైద్యఎసిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పసుపు ప్రాసెసింగ్ యూనిట్ పరిశీలన


అధికారులతో మాట్లాడుతున్న జీసీసీ ఎం.డి సురేష్‌కుమార్

మక్కువ: మండలంలోని మార్కొండపుట్టి గ్రామంలో గల పసుపు ప్రాసెసింగ్ యూనిట్‌ను జీసీసీ ఎం.డి సురేష్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గిరిజనులు సాగుచేసిన పంట ఉత్పత్తులను వనధన్ వికాస్ కేంద్రాల్లోనే విక్రయించేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. గిరిజనులు దళారుల బారిన పడకుండా ఉండేందుకు ఏర్పాటు చేసిన వన్‌ధన్ వికాస్ కేంద్రాలతో మహిళాసంఘాలు ఆర్థికంగా బలోపేతమవుతాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వెలుగు ఏపీఎం సన్నిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

జియ్యమ్మవలస: మండలంలోని చింతలబెలగాం గ్రామానికి చెందిన యువతి అదృశ్యంపై ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిన్నంనాయుడు మంగళవారం తెలిపారు. పార్వతీపురంలోని జనహిత కాలేజీలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న యువతి ఈ నెల 1న పరీక్ష రాసేందుకు వెళ్లి తిరిగి రాలేదని, అప్పటి నుంచి తెలిసిన అన్ని చోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

తప్పిపోయిన మహిళ ఆచూకీ లభ్యం

మండలంలోని బిత్రపాడు గ్రామానికి చెందిన మహిళ అదృశ్యంపై ఈ నెల 1న ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై విచారణ చేసిన చినమేరంగి పోలీసులు మంగళవారం ఆమెను పట్టుకుని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్సై చిన్నంనాయుడు, ఏఎస్సై కాసులు, హెచ్‌సీ సోములకు మహిళ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ


మాట్లాడుతున్న మండల కన్వీనర్ జనార్దనరావు

కొమరాడ: ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు అన్నారు. మండలంలోని కళ్లికోట గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2 కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన శిబిరానికి హాజరైన రోగులకు వైద్యులు అందించే సేవలను పరిశీలించారు. ఉన్న ఊరిలోనే వైద్యం దొరికేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారన్నారు. 104, 108 సేవలతో పాటు గ్రామాల్లోనే వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటు, ఫ్యామిలీ డాక్టర్ విధానం, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీనే మళ్లీ గెలిపించాలని ఆయన కోరారు.

ఇంటిపన్ను వసూళ్లపై దృష్టి

వీరఘట్టం: ఇంటిపన్ను వసూళ్లపై దృష్టిసారించాలని ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన ఆయన గ్రామపంచాయతీల్లో అభివృద్ధి పనులకు సాధారణ నిధులను మనమే సేకరించుకోవాలన్నారు. సర్పంచ్‌లతో మాట్లాడి, వారి సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో బకాయిపడ్డ ఇంటిపన్నును సకాలంలో వసూలు చేయాలని కార్యదర్శులను ఆదేశించారు.

తప్పు చేసినవారు ఎంతటివారైనా శిక్షార్హులే


సబ్‌జైలులో రికార్డులు పరిశీలిస్తున్న సన్యాసినాయుడు

పాలకొండ: తప్పు చేసిన వారు ఎంతటివారైనా శిక్షార్హులేనని శ్రీకాకుళం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, సబ్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు హెచ్చరించారు. మంగళవారం స్థానిక పట్టణంలోని సబ్‌జైలును సందర్శించిన ఆయన ఖైదీలు, వివిధ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఖైదీలు మంచి నడవడిక నేర్చుకునేలా చర్యలు తీసుకోవాలని సూపరింటెండెంట్ జోగులుకు తెలిపారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' పేదలకు వరం


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని చినగీసాడ గ్రామంలో మంగళవారం దుడ్డుఖల్లు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్, ఇతర వైద్య నిపుణులు సుమారు 247 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శిబిరంలో వైద్య ఆరోగ్య సిబ్బంది, గ్రామ సచివాలయం సిబ్బంది, వలంటీర్లు సేవలందించారు.

లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాంతో సత్ఫలితాలు

• ఎంఈవో డి.గౌరినాయుడు


రేగులపాడు కేజీబీవీలో లిప్ కార్యక్రమ అమలుపై ఆరాతీస్తున్న ఎంఈవో గౌరినాయుడు

వీరఘట్టం: విద్యార్థుల అభ్యసన స్థాయిని పెంచేందుకు పాఠశాలల్లో అమలు చేస్తున్న ఎల్‌ఐపీ(లిప్/లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం) సత్ఫలితాలను ఇస్తోందని ఎంఈవో డి.గౌరినాయుడు అన్నారు. మండలంలోని సంతనర్సిపురం, రేగులపాడు ప్రాంతాల్లోని కేజీబీవీ(కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం)లను ప్రత్యేక ఉపాధ్యాయ బృందాలతో కలిసి మంగళవారం సందర్శించిన ఆయన ఉపాధ్యాయుల విద్యాబోధన, విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలించారు. జిల్లాలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 6,7,8 తరగతుల విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు తెలుసుకునేందుకే ప్రభుత్వం ఎల్‌ఐపీ నిర్వహిస్తోందని డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమం అమలును ఈ నెల 9వ తేదీ వరకు ఉపాధ్యాయ బృందాలు పరిశీలిస్తాయన్నారు. ఈ బృందంలో ఎంఈవో, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్, డీఆర్‌పీలు సభ్యులుగా ఉంటారన్నారు.

దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

పాలకొండ రూరల్: స్థానిక పట్టణంలోని పలు దుకాణాల్లో ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి దవల భాస్కరరావు నేతృత్వంలో ఎన్‌టీపీసీ స్వచ్ఛంద సంస్థ సభ్యురాలు కె.భవాని మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిషేధిత పొగాకు, ఖైనీ, గుట్కా వంటివి అమ్ముతున్నదీ లేనిదీ పరిశీలించారు. వాటిని అమ్ముతూ పట్టుబడిన పలువురు దుకాణాదారులకు అపరాధ రుసుం విధించారు. విద్యాసంస్థల ఆవరణ, పరిసరాల్లో పొగాకు, సిగరెట్లు వంటివి విక్రయిస్తే నేరమన్నారు. నెలకు రెండుసార్లు ఇలా ఆకస్మిక తనిఖీలు చేయడం జరుగుతుందని, ఈసారి ఎవరైనా పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజలకు అందుబాటులో సేవలు


వైద్యసేవలపై రోగులను ప్రశ్నిస్తున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

పార్వతీపురం:

ప్రజలకు అందుబాటులో సేవలను అందిస్తున్నామని పార్వతీపురం మన్యం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. ఈ మేరకు గరుగుబిల్లి మండలం గొట్టివలస గ్రామంలోని జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్-2) కార్యక్రమాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. శిబిరంలో ఏర్పాటు చేసిన వివిధ కౌంటర్ల వద్ద రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. స్పెషలిస్ట్ వైద్యుల కౌంటర్ల వద్ద రోగులకు నిర్వహిస్తున్న తనిఖీలను పరిశీలించి వారి అనారోగ్య సమస్యలను తెలుసుకున్నారు. రోగులు చెప్పే ఆరోగ్య సమస్యలను పూర్తి స్థాయిలో తెలుసుకుని తగు చికిత్స అందజేయాలని వైద్యులకు స్పష్టం చేశారు. ల్యాబ్ కౌంటర్ వద్ద రక్త పరీక్షలను, వాటి నివేదికలను పరిశీలించి హెచ్చు తగ్గులున్న వారిని పర్యవేక్షణ చేయాలని చెప్పారు. డా. వైఎస్సార్ కంటి వెలుగు తనిఖీలను పరిశీలించి కేటరాక్ట్ సర్జరీలకు గుర్తించిన వారికి సరైన నిర్దేశం చేయాలని, కళ్లజోళ్లు అవసరమైన వారి వివరాలు సంబంధిత వైద్యసిబ్బంది పరిశీలనలో ఉండాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సంతోష్ కుమార్, ఈఓపీఆర్డీ గోపాలరావు, సర్పంచ్ చంద్రి నాయుడు, స్పెషలిస్ట్ వైద్యులు డాక్టర్ రత్నం, డాక్టర్ స్నిగ్ధ, పంచాయతీ సెక్రటరీ భాస్కరరావు, వైద్య సిబ్బంది, సచివాలయం సిబ్బంది, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, రవి, ఆశ కార్యకర్తలు, గ్రామ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.